క్లుప్తంగా

పిడుగురాళ్ల స్టేషన్ అభివృద్ధికి రూ. 19 కోట్లు మంజూరు

ఎస్‌సీ రైల్వే జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడు మద్దాలి సుబ్బయ్య

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులకు రూ. 19.3 కోట్ల నిధులు మంజూరు అయినట్లు సికింద్రాబాద్ రైల్వే జెడ్ఆర్‌యూసీసీ మెంబర్ మద్దాలి సుబ్బయ్య గురువారం తెలిపారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా పిడుగురాళ్ల రైల్వే స్టేషన్ అభివృద్ధికి నిధులు మంజూరు అయ్యాయన్నారు. ఈ నిధుల మంజూరు కోసం నర్సరావుపేట పార్లమెంట్ సభ్యుడు శ్రీ కృష్ణదేవరాయలు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని కేంద్ర రైల్వేమంత్రి, ప్రధాన మంత్రి నరేంద్రమోదీల దృష్టికి తీసుకొని వెళ్లి అమృత్ భారత్ పథకం ద్వారా అభివృద్ధి నిధులను మంజూరు చేయించారన్నారు

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు

సీఐ జయకుమార్

కారెంపూడి: తోపుడు బండ్ల వ్యాపారులు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని కారెంపూడి సీఐ దార్ల జయకుమార్, ఎస్ఐ ఎం.రామాంజనేయులు కోరారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం తోపుడు బండ్ల వ్యాపారులకు పోలీస్ అధికారులు ట్రాఫిక్ నిబంధనలను వివరించారు. వాటి ఉల్లంఘనకు పాల్పడితే కేసులు నమోదు చేయాల్సి వస్తుందన్నారు. ప్రజలకు, వాహనదారులకు అసౌకర్యం కలగకుండా వ్యాపారాలు చేసుకోవాలన్నారు. వ్యాపారం కోసమని రోడ్డు మీదకు రావడం వల్ల ట్రాఫిక్ సమస్య వస్తుందన్నారు. అందరూ కూడా క్రమ పద్ధతిలో వారికి కేటాయించిన స్థలంలోనే వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్ఓకు తీవ్రగాయాలు



పిడుగురాళ్ల: లారీ ఢీకొని గ్రామ సచివాలయ వీఆర్ఓ తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. పట్టణంలోని 2వ సచివాలయ పరిధిలోని వీఆర్ఓగా విధులు నిర్వహిస్తున్న సుభాని దాచేపల్లి మండలం పొందుగుల సమీపంలో బుధవారం రాత్రి లారీ ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ప్రథమ చికిత్స నిర్వహించి నర్సరావుపేటకు తరలించారు. నర్సరావుపేటలో ఓ ప్రైవేటు హాస్పటల్‌లో చికిత్స పొందుతున్నాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పిడుగురాళ్ల: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలోని కొండమోడు గుడిసె హోటల్ సమీపంలో బైపాస్ క్రాస్ వద్ద చోటు చేసుకుంది. ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజుపాలెం మండలం నెమలిపురి గ్రామం శ్రీనివాసనగర్‌కు చెందిన వెంకటేశ్వర్లు (64) పిడుగురాళ్ల పట్టణానికి మోపెడ్‌పై వచ్చి తిరిగి వెళ్తున్న సమయంలో పాల లారీ ఢీకొనటంతో అక్కడిక్కడే మృతి చెందాడు. పట్టణ ఎస్ఐ పవన్‌కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతానికి రైతు మృతి



కారెంపూడి: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మిరియాల గ్రామానికి చెందిన మేకల వెంకటరెడ్డి (45) గత ఐదు రోజులుగా కన్పించడం లేదు. అతని ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతుకుతున్నారు. ఈ క్రమంలో అతని పొలంలోనే శవమై గురువారం కన్పించాడు. బంధువుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గురజాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎర్రవాగు పొలంలో వరి నారు మడికి పోశాడని ఆ నారు మడికి నీరు పెట్టేందుకు వెళ్లి మోటార్ స్విచ్ ఆన్ చేసే క్రమంలో వర్షానికి తడిసిన అక్కడున్న తీగలు తగలడం వల్ల విద్యుదాఘాతానికి గురై వెంకటరెడ్డి మృతి చెంది ఉంటాడని పోలీసులు తెలిపారు. వెంకటరెడ్డి మృతితో మిరియాల గ్రామంలో తీవ్ర విషాదం అలుముకుంది. పోస్టు మార్టమ్ అనంతరం మృతదేహాన్ని గ్రామానికి తీసుకు వచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. సీఐ దార్ల జయకుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ రామాంజనేయులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాపు జేఏసీ కన్వీనర్‌గా నూనె శ్రీనివాస్



కారెంపూడి: మాచర్ల నియోజకవర్గ కాపు జేఏసీ కన్వీనర్‌గా మండలంలోని పేటసన్నెగండ్ల గ్రామానికి చెందిన నూనె శ్రీనివాస్ నాయుడును నియమిస్తూ పల్నాడు జిల్లా కాపు జేఏసీ అధ్యక్షుడు కురియాల విజయభాస్కర్ గురువారం నియామక పత్రం అందించారు. గత రెండేళ్లుగా కూడా ఆయన ఆ పదివిలో కొనసాగారు. రెండవసారి కూడా శ్రీనివాస్‌ను నియమిస్తూ కాపు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అమ్మి శ్రీనివాసరావు ఆదేశాల ప్రకారం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌ను నియమించారు.

‘వైఎస్సార్ సంపూర్ణ పోషణ’తో ఆరోగ్యం

ఎంపీపీ కటకం జయశ్రీ

దాచేపల్లి: మండలంలోని కేసానుపల్లి గ్రామంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ రేషన్ సరుకులను గురువారం పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలకు రేషన్ సరుకులను ఎంపీపీ కటకం జయశ్రీ చేతుల మీదుగా అందజేశారు. ప్రభుత్వం అందించే రేషన్ సరుకులు ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఎంతో దోహదపడతాయని, శరీరంలో పోషక విలువలు పెరుగుతాయని ఎంపీపీ జయశ్రీ చెప్పారు. సర్పంచ్ వినుకొండ కోటేశ్వరరావు, ఉపసర్పంచ్ కోట కొండలు, పంచాయతీ కార్యదర్శి నాగెండ్ల రత్నం, నాయకులు బొల్లా శ్రీనివాసరావు, ఉల్లేరు హనుమంతరావు, నెల్లూరి కోటేశ్వరరావు, గోవర్ధన్‌రావు, అంగన్‌వాడీ కార్యకర్తలు రత్నకుమారి, భాగ్యలక్ష్మి, ఖాసీంబీ పాల్గొన్నారు.

పోషకాహార కిట్ల పంపిణీ

కారెంపూడి: గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రభుత్వం ఎనలేని శ్రద్ధ చూపుతోందని, వారికి అందాల్సిన రేషన్‌ను వారి ఇంటి వద్దే అందించే విధంగా ప్రభుత్వం తీసుకున్న చర్యలే దీనికి నిదర్శమని కాచవరం గ్రామ సర్పంచ్ నవులూరి లక్ష్మయ్య, మాజీ సర్పంచ్ క్రిష్ణపాటి అంకిరెడ్డి పేర్కొన్నారు. గ్రామంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం జరిగిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ ‘టేక్ హోం రేషన్’ కార్యక్రమంలో పాల్గొని గర్భిణులు, బాలింతలకు పోషకాహార కిట్స్‌ను పంపిణీ చేశారు. గతంలో కంటే తల్లీబిడ్డల ఆరోగ్యం చాలా మెరుగ్గా ఉంటోందని దానికి ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధే ప్రధాన కారణమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు దిబ్బమడుగు వీరయ్య, దిబ్బమడుగు వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు వెన్నపూసల జగన్‌మోహన్‌రెడ్డి, తెప్పాల తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కేసానుపల్లిలో సరుకులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ కటకం జయశ్రీ



మాచర్లలో కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

జేకే కాలనీలో...

పిడుగురాళ్ల: పట్టణంలోని 3వ సచివాలయం పరిధిలోని జేకే కాలనీలో అంగన్‌వాడీ సెంటర్‌లో పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. కౌన్సిలర్ బడిగుంతల వెంకటేశ్వర్లు నాగమణి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బాలింతలు, గర్భిణులు ఆరోగ్యంగా ఉంటే రాబోయే తరాలు కూడా ఆరోగ్యంగా ఉంటాయని గుర్తించిందన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

చింతలతండాలో...

విజయపురిసౌత్: రాష్ట్ర ప్రభుత్వం తల్లి, బిడ్డల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పది రకాల పౌష్టికాహార పదార్థాలను అందజేస్తోందని మాచర్ల జడ్పీటీసీ సభ్యుడు మల్లుస్వామి అన్నారు. గురువారం మాచర్ల మండలం చింతలతండా గ్రామంలోని అంగన్‌వాడీ-2 కేంద్రంలో గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను అందజేసి మాట్లాడారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ కేతావత్ శ్రీనునాయక్, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మాచర్లలో..

మాచర్ల: పట్టణంలోని వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణులు, బాలింతలకు గురువారం 1,3,4 వార్డులలో పంపిణీ చేశారు. కౌన్సిలర్లు గట్ల అరుణ కోటిరెడ్డి, ఎం.రామాంజనేయరెడ్డి, రామిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆయా అంగన్‌వాడీకేంద్రాలలో పోషణ కిట్ల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు రక్తహీనత, బలహీనతతో బాధపడకూడదని నేరుగా ఇంటికే రేషన్ అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కళ్ల కలకలపై అప్రమత్తంగా ఉండాలి

పిడుగురాళ్ల: కళ్ల కలకలపై ప్రజలు ముఖ్యంగా చిన్న పిల్లలు అప్రమత్తంగా ఉండాలని పల్నాడు హాస్పటల్స్ అధినేత డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లడుతూ కళ్ల కలక అనేది వైరస్ లేదా బ్యాక్టీరియా లేదా ఏదైనా అలర్జీ వలన కలుగుతుందన్నారు. వైరస్ లేదా బ్యాక్టీరియా వల్ల వచ్చే కలకలు ఒకరి నుంచి ఒకరికి వేగంగా వ్యాప్తి చెందుతాయని, ముఖ్యంగా పాఠశాలల్లో పిల్లలకు ఒకరి నుంచి ఒకరికి లేక గుంపుగా ఉన్న ప్రదేశాల్లో అధికంగా ఇది వ్యాప్తి చెందుతుందని ఆయన తెలియజేశారు. అలర్జీ వల్ల కలిగేది ఆ వ్యక్తి రోగ నిరోధక వ్యవస్థ మీద మాత్రమే ఆధారపడి ఉంటుందని వైరస్ లేదా అలర్జీ వల్ల కలిగేది తక్కువ సమయంలో తీవ్రమైన లక్షణాలతో వచ్చి తేలికగా తగ్గిపోతుందని స్పష్టం చేశారు. బ్యాక్టీరియా వల్ల కలిగేది కొన్ని రోజుల వ్యవధిలో పెరిగి కన్నుమీద చాలా ఎక్కువ ప్రభావం చూపిస్తుందని దీనివల్ల చూపు కూడా దెబ్బతినే ప్రమాదం ఉందని అశోక్‌కుమార్ పేర్కొన్నారు. అలాగే కొన్నిసార్లు కొన్ని రసాయనాల వల్ల కూడా కళ్ల కలకలు వచ్చే అవకాశం ఉందని అప్పుడు శుభ్రమైన నీటితో కళ్లను కడగడం వల్ల తగ్గిపోతుందని, లక్షణాలు తీవ్రంగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలియజేశారు.

ముఖ్యమంత్రిపై పూర్తి విశ్వాసం

ఎన్జీఓస్ సంఘ నేతలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, ఎన్జీఓస్ సంఘం నేతలు

నకరికల్లు: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల్ని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తీరుస్తారన్న పూర్తి విశ్వాసం తమకు ఉందని ఏపీ ఎన్జీఓస్ సంఘం నరసరావుపేట తాలూకా అధ్యక్షుడు ఎం.రామకృష్ణ తెలిపారు. విజయవాడలో ఆగస్టు 21,22వ తేదీల్లో నిర్వహించనున్న ఏపీ ఎన్జీఓస్ రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను గురువారం నకరికల్లులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ 21వ రాష్ట్ర మహాసభలకు ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. ఎన్జీఓల సమస్యలపై ముఖ్యమంత్రికి విన్నవించేందుకు రాష్ట్రంలోని 10వేల మంది ఉద్యోగులు కూడా పాల్గొననున్నట్లు చెప్పారు. మహాసభను విజయవంతం చేసేందుకు ప్రతి మండలంలోనూ ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నరసరావుపేటలోని ఎన్జీఓ హోం నుంచి సభకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం కల్పించినట్లు వెల్లడించారు. మండలంలోని అన్ని శాఖల ఉద్యోగులు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, ఏపీ ఎన్జీఓస్ సంఘం తాలూకా కార్యదర్శి మాదాసు ఆనందనాథ్, ట్రెజరర్ సీహెచ్.కోటిరెడ్డి పాల్గొన్నారు.

అవయవ దానానికి ముందుకు రావాలి

క్రోసూరు: అవయవ దానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎంపీడీవో బి.మహేష్ తెలిపారు. అజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో అవయవ దానంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అన్ని దానాల్లో కెల్లా అవయవ దానం ఎంతో గొప్పదన్నారు. ఆరోగ్యవంతులైన ప్రజలు మరణించిన తరువాత ఇతరులకు ఉపయోగపడేలా అవయవ దానానికి ముందుకు రావాలని తెలిపారు. కొంతమంది అవయవ దానాలు ఇచ్చి ఏకకాలంలో ఎంతో మందికి ఉపయోగపడుతున్న సంఘటనల్ని నిత్యం మనం చూస్తూనే ఉన్నామని పేర్కొన్నారు. అలాంటి దాతల జన్మధన్యమని తెలిపారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని అందరూ ముందుకు రావాలన్నారు. అవదానం చేయదలుచుకున్న వారు వివరాలతో డిక్లరేషన్‌ను ఏదైనా స్వచ్ఛంద సంస్థ లేదా వైద్యశాఖకు అందజేయవచ్చని తెలిపారు. ఈవోపీఆర్డీ పి.శివరామయ్య, పంచాయతీ సెక్రటరీలు, ప్రజలు పాల్గొన్నారు.

హోమియో వైద్యశిబిరం

యడ్లపాడు: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు జేవీవీ పల్నాడు జిల్లా అధ్యక్షులు దార్ల బుజ్జిబాబు, ట్రెజరర్ ఏవీ శివయ్య తెలిపారు. మండల కేంద్రమైన యడ్లపాడు రచ్చబండ సెంటర్లో శుక్రవారం ఉదయం 10 గంటలకు తహసీల్దార్ ఎస్. నాగమల్లేశ్వరరావు ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. అన్ని రకాల వ్యాధులు, సమస్యలకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు.

కారు ఢీకొన్న ప్రమాదంపై కేసు నమోదు

నాదెండ్ల: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొని తండ్రీ కొడుకులు గాయాలపాలైన ప్రమాదంపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై జె బలరామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు చిలకలూరిపేట మద్దినగర్‌లో నివాసం ఉంటున్న తండ్రీకొడుకులు షేక్ మౌలాలి, మస్తాన్‌వలి ఈ నెల 2న గణపవరంలో పింఛను సొమ్ము తీసుకుని తమ ద్విచక్ర వాహనంపై తిరిగి చిలకలూరిపేటకు వెళ్తున్నారు. ఈ క్రమంలో జాతీయ రహదారిని దాటుతుండగా మంగళగిరి నుంచి నంద్యాల వెళ్తున్న కారు వేగంగా ఢీకొంది. దీంతో తండ్రి మౌలాలి తీవ్రగాయాలపాలుకాగా జీజీహెచ్‌కు తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రమాదంలో గాయాలపాలైన మస్తాన్‌వలి చిలకలూరిపేట ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ సుబ్బారాయుడును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

చంటి బిడ్డను సైతం వదిలి..
200 కి.మీ వెళ్లి పింఛన్ అందజేత

కారెంపూడి: చంటి బిడ్డను సైతం ఇంట్లో వదలి పెట్టి ఆపదలో ఉన్న వృద్ధుడికి పింఛన్ ఇచ్చేందుకు రానుపోను 200 కిలోమీటర్లు దూరం ప్రయాణించారు మండలంలోని నరమాలపాడు గ్రామ వలంటీర్ బండి మల్లిక. ఇటీవల అడిగొప్పల అమ్మవారి గుడి రోడ్డులో ట్రాక్టర్ బోల్తాపడి తీవ్రంగా గాయపడి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న షేక్ ఇమామ్ సాహెబ్‌కు వృద్ధాప్య పింఛన్ అందించేందుకు గుంటూరు వెళ్లిన మల్లిక ఆయనకు పింఛన్ అందించారు. ఇమామ్ సాహెబ్‌కు ఆ ప్రమాదంలో పక్కటెముకలు విరిగిపోయి లంగ్స్ కూడా డామేజ్ అయ్యాయి. ఆయన కుమారుడు గుంటూరులోనే ఇల్లు అద్దెకు తీసుకుని జీజీహెచ్‌లో తండ్రికి చికిత్స చేయిస్తున్నాడు. మల్లిక గుంటూరు వెళ్లి ఇమామ్ సాహెబ్‌కు పింఛన్ అందించారు. కష్టాలలో ఉన్న వృద్ధుడికి పింఛన్ అందించేందుకు చంటిబిడ్డను సైతం వదిలి వచ్చిన మల్లిక సేవలను పలువురు కొనియాడారు.

డ్వాక్రా గ్రూపులను బలోపేతం చేయండి

మాచర్ల: ప్రతి డ్వాక్రా మహిళను చైతన్య పరచి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించి ఆన్‌లైన్ విధానం ద్వారా కార్యకలాపాలు వివరించి సంఘాల నిర్వాహణలో ఆర్పీలు కీలకపాత్ర వహించాలని మాచర్ల మెప్మా ప్రాజెక్టు మిషన్ మేనేజర్ ఎం.సుబ్బారావు అన్నారు. గురువారం స్థానిక మెప్మా ప్రాజెక్టు కార్యాలయంలో పట్టణ మహిళా సమైఖ్య అధ్యక్షురాలు బూదాల మరియమ్మ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలతో పాటు బ్యాంకు లావాదేవీల అంశాల పై ఆర్పీలు జాగ్రత్త వహించాలన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం అమలు చేసే పథకాల గురించి ఆయా సంఘాలకు వివరించటంతో పాటు డ్వాక్రా మహిళా సంఘాలను మరింత బలోపేతం చేయాలన్నారు. వివిధ పథకాల గురించి వివరించారు. సీసీలు రాజశేఖర్, అంజలిదేవి, ఆర్పీలు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

గురజాల: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య అన్నారు. మండల పరిధిలోని చర్లగుడిపాడు గ్రామంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ బిడ్డకు పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలన్నారు. ముర్రుపాలు తాగడం వలన బిడ్డ ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు తల్లిపాల గురించి, వాటి విశిష్టత గురించి సూపర్‌వైజర్ వివరించారు. సర్పంచ్ బత్తుల ప్రసాద్, సూపర్‌వైజర్ అరుణ శ్రీ, ముక్కటం, పోటు సాంబయ్య, బండ్ల సాంబశివరావు, రాయవరపు శ్రీనివాసరావు, పోటు వేణు, దేవరశెట్టి మణిదీప్, కాసా అనిల్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

మాచర్ల: పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో శుక్రవారం డాక్టర్ రామలింగారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు పెన్షనర్స్ అసోసియేషన్ నాయకుడు నందా నరసింహయ్య తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ అగ్ని ప్రమాద బాధితురాలి మృతి

అచ్చంపేట: అగ్ని ప్రమాదంలో చిక్కుకున్న చిన్నారిని కాపాడేందుకు ప్రయత్నించి విఫలమై, తీవ్ర గాయాలపాలైన దాములూరి మేరీలు (56) గత 45 రోజులుగా మృత్యుతో పోరాడుతూ గురువారం ఉదయం మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పెదపాలెం ఎస్సీ కాలనీలో జూన్ 18న జరిగిన అగ్ని ప్రమాదంలో 14 పూరి పాకలు దగ్ధమైన సంగతి తెలిసిందే. ఈ సమయంలో 18 నెలల పాప ఉయ్యాలలో నిద్రిస్తుండగా కాపాడేందుకు ప్రయత్నించి అమ్మమ్మ దాములూరి మేరీలు తీవ్ర గాయాలపాలైంది. ఆమెను గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటి నుంచి మేరీలు మృత్యువుతో పోరాడుతూనే ఉంది. వైద్యులు ఆమెను బతికించేందుకు తీవ్ర ప్రయత్నం చేసినా, ఫలితం లేక పోయింది. గురువారం ఉదయం మేరీలు మృతి చెందారు.

సచివాలయ ఉద్యోగి సస్పెన్షన్

వినుకొండ(నూజెండ్ల) : పట్టణంలోని హనుమాన్‌నగర్ సచివాలయంలో పనిచేస్తున్న ఇంజనీర్ సెక్రటరీ బలరాం నాయక్‌ను సస్పెండ్ చేసినట్లు కమిషనర్ వెంకయ్య తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్ హౌసింగ్ పథకంలో లబ్ధిదారులకు ఇల్లు కట్టకుండానే బిల్లులు మంజూరు చేసినందుకు క్రమశిక్షణా చర్యల్లో భాగంగా జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

సమస్యలకు సైన్స్ ప్రాజెక్ట్‌లు పరిష్కారం చూపాలి

–డిప్యూటీ డీఈఓ వేణుగోపాల్

నరసరావుపేట రూరల్: ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాలు చూపే బాల శాస్త్రవేత్తలుగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని డిప్యూటీ డీఈఓ వేణుగోపాల్ తెలిపారు. మండలంలోని లింగంగుంట్ల శంకర భారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రాజెక్ట్ తయారు చేసే విధానంపై సైన్స్ ఉపాధ్యాయులకు గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని ఉన్నత పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈఓ వేణుగోపాల్ మాట్లాడుతూ సమాజంలోని సమస్యలపై బాల్యదశ నుంచి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. తద్వారా వాటికి పరిష్కార మార్గాలను చూపే బాల శాస్త్రవేత్తలుగా విద్యార్థులను తయారు చేయాలన్నారు. విద్యార్థులు తయారు చేసే ప్రాజెక్టుల ద్వారా జిల్లాకు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్ఓ మధుకుమార్, ఏఎంఓ శ్రీనివాసరావు, జీసీడీఓ రేవతి, జిల్లా అకడమిక్ కో ఆర్డినేటర్ సీతారామయ్య, రీసోర్స్ పర్సన్స్ నాగేశ్వరరావు, అప్పారావు, రాజశేఖర్ పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ వేణుగోపాల్

రోడ్డు ప్రమాదంలో ఆర్ఎంపీ మృతి



డాక్టర్ నబీషా (ఫైల్)

రొంపిచర్ల: మండలంలోని అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిపై రొంపిచర్ల, సంతగుడిపాడు మధ్యలో ప్రమాదవశాత్తు మోటారు సైకిల్ డివైడర్‌ను ఢీకొన్న సంఘటనలో కర్లకుంట గ్రామానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ షేక్ అబ్దుల్ నబీషా (40) గురువారం మృతి చెందారు. రొంపిచర్ల గ్రామం నుంచి మోటార్ సైకిల్‌పై డాక్టర్ నబీషా కర్లకుంట గ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. మోటార్ సైకిల్ డివైడర్‌ను ఢీకొట్టటంతో తీవ్ర గాయాలతో రోడ్డుపై పడిపోయిన నబీషాను చూసిన స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. రొంపిచర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వైద్యశాల్లో డాక్టర్ నబీషా మృతదేహాన్ని ఆర్ఎంపీ, పీఎం పారా మెడికల్ అసోసియేషన్ నాయకులు సందర్శించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ డాక్టర్లు వాకా అంకిరెడ్డి, జోగేశ్వరబాబు, భాస్కర్‌రెడ్డి, సంగీతరావు, హరిబాబు, మస్తాన్‌వలి, అంజిరెడ్డి, గోదా రమేష్ కుమార్, వెంకటేశ్వర్లు, నాసరయ్య, రమేష్‌బాబు పాల్గొన్నారు.

నవోదయంపై అవగాహన



మాట్లాడుతున్న అధికారులు



సమావేశానికి హాజరైన అర్జీదారులు

గతనెల 14న నిర్వహించిన నవోదయంలో వ్యాపారాల కోసం అర్జీలు పెట్టుకున్న ఎస్సీ, ఎస్టీలకు గురువారం కలెక్టరేట్‌లో వాటిపై అవగాహన నిర్వహించారు. కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ప్రతినెలా 14వ తేదీన ఎస్సీ, ఎస్టీల ఆర్థికాభివృద్ధి కోసం నవోదయం నిర్వహిస్తున్న విషయం విదితమే. జిల్లా పరిశ్రమల అధికారి పి.వెంకటేశ్వ రావు, ఉద్యానవన శాఖ అధికారి బీజే బెన్నీ, నోడల్ అధికారి పి.సంజీవ రావు వివిధ రకాల వ్యాపారాలు, తద్వారా పొందాల్సిన బ్యాంకు రుణాల గురించి వివరించారు.

–నరసరావుపేట

ఓటర్ల జాబితాల తనిఖీలో అశ్రద్ధ వద్దు

ముప్పాళ్ల: మండలంలోని ప్రతి గ్రామంలో ఓటర్ల జాబితాలోని వివరాల్ని క్షుణ్ణంగా పరిశీలించాలని తహసీల్దార్ ఎం.భవానీశంకర్ తెలిపారు. ఒకే ఇంటి నంబర్‌పై అధిక సంఖ్యలో ఓట్లు నమోదై ఉంటే వారి నుంచి దరఖాస్తులు నమోదు చేయించాలని చెప్పారు. తన కార్యాలయంలో బీఎల్ఓలతో గురువారం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ చనిపోయిన వారి ఓట్లను తొలగించాలని, 18 సంవత్సరాలు నిండిన యువతీ,యువకులతో ఓటుహక్కు కోసం దరఖాస్తులు చేయించాలని తెలిపారు. అన్ని గ్రామాల్లో ఓటర్ల జాబితాల తనిఖీ ప్రక్రియ ఈ నెల 21లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్ సీహెచ్. లక్ష్మీప్రసాదు, ఆర్ఐలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ భవానీశంకర్

సంక్షేమం అర్హుల దరిచేరాలి

జెడ్పీటీసీ సభ్యుడు పిల్లి ఓబుల్ రెడ్డి

రొంపిచర్ల: మండలంలో అర్హులైన లబ్దిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు పిల్లి ఓబుల్‌రెడ్డి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి ఎండీవో కె.మ్యాథ్యూబాబు అధ్యక్షత వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు పిల్లి ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మండలంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయవలసిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎంపీపీ గడ్డం బాలనాగమ్మ మాట్లాడుతూ గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం స్థాపన కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారన్నారు. గ్రామ సచివాలయాల్లో సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. మండలంలో అధికారులు సమన్వయంగా పనిచేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. అనంతరం గర్భిణులకు, బాలింతలకు టేక్ హోం రేషన్ సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



వేదికపై ప్రజా ప్రతినిధులు

ఫణిదం పీహెచ్‌సీలో కిల్కారిపై ఆశాలకు శిక్షణ

సత్తెనపల్లి(ముప్పాళ్ల): సత్తెనపల్లి మండలంలోని ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆశ కార్యకర్తలకు కిల్కారి, మొబైల్ అకాడమీపై అవగాహనతో పాటు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కోర్సు స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ రాజు పాల్గొన్నారు. మాతాశిశు సంరక్షణ సేవలు, హైరిస్క్ ప్రెగ్నెంట్ ఉమెన్ గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని వివరించారు. సత్తెనపల్లి డివిజన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నాగపద్మజ, పల్నాడు జిల్లా డీసీఎం సురేష్, సూపర్‌వైజర్లు వెంకటేశ్వర్లు, మణిరావు, సంపూర్ణదేవి, వరలక్ష్మి, మార్గరెట్ పాల్గొన్నారు.

6న పురోహిత సంఘ సదస్సు

సత్తెనపల్లి(ముప్పాళ్ల): శ్రీ వేద గాయత్రీ పురోహిత సంఘం ఆధ్వర్యంలో పల్నాడు, బాపట్ల జిల్లాల సంయుక్త పురోహిత ఆత్మీయ సదస్సు ఈ నెల 6న సత్తెనపల్లిలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు కలవకొలను సీతారామశాస్త్రి గురువారం తెలిపారు. ఉదయం 9గంటలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం అనంతరం తాలూకా సెంటర్‌లోని మన్నెం రెసిడెన్స్‌లో సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. వివరాలకు 9849549091 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు